www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 21 జనవరి 2025
5
వైఎస్ఆర్



## కడప డిఇఒగా షంషుద్దీన్

ప్రజాశక్తి - కడప అర్బన్



కడప జిల్లా నూతన విద్యా శాఖాధికారిగా కర్నూలు జిల్లా తాండ్రపాడు డైట్ సీనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఎస్.షంషుద్దీన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్త ర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు జిల్లా విద్యాశాఖ అధికారిగా వ్యవహరించిన మీనాక్షిపై ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ఆరోపణలు, ఉద్యమాలు చేసిన నేపథ్యంలో ఆమె స్థానంలో షంషుద్దీన్‌ను నియమిస్తూ పాఠశాల విద్యా ప్రభు త్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# కెసి నీటి విడుదలపై స్పష్టత ఏదీ?


కెసి కాలువలో ప్రవహిస్తున్న నీరు

### - ఆరుతడి పంటల సాగులో నెలకొన్న సందిగ్ధత

ప్రజాశక్తి - చాపాడు

కెసి కాలువకు నీటిని ఎంత వరకు విడుదల చేసేది స్పష్టమైన హామీ లేకపోవడంతో రైతుల్లో సందిగ్ధత నెలకొని ఉంది. ప్రస్తుతం కెసి కాలువ కింద వరి పంట నూర్పిడి చేసి ఆరుతడి పంటల సాగుకు సిద్ధంగా ఉన్నారు. కెసి కాలువకు జనవరి మెదటి నుంచి తక్కువ పరిమాణంలో నీరు ప్రవహిస్తుంది. ముందుగా ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరి పంటకు మాత్రమే నీరు వస్తాయని ఆ తర్వాత నిలిపివేస్తామని అధికార ప్రకటనలు చేయకుండా రైతులకు సమాచారం ఇస్తూ వచ్చారు. దీంతో ఆరుతడి పంటల సాగు ఈ ఏడాది సాధ్యపడదని రైతులు కాస్త వెనకడుగు వేశారు. అయితే ప్రస్తుతం కాలువలో నీరు ప్రవహిస్తుండటంతో నూగు, పెసర, మినుము పంటలు సాగు చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఈ ఏడాది సకాలంలో కెసి కాలువకు నీరు విడుదల చేయడంతో ఖరీఫ్ సీజన్‌లో 13వేల ఎకరాలలో వరి పంటను రైతులు సాగు చేయగలిగారు. ప్రస్తుతం రబీలో 3వేల ఎకరాలలో మాత్రమే నీటి వసతి ఉన్న రైతులు, కుందూ పరిధిలో వరి ఇతర పంటలు సాగు చేపట్టారు. మిగిలిన 10వేల ఎకరాలలో సాగుకు వెనుకడుగు వేస్తున్నారు. అధికారులు కెసి కాలువకు నీటి విడుదల పై స్పష్టమైన ప్రకటన ఇచ్చి నీరు విడుదల అవుతుందా లేదా అన్న సమాచారం అందిస్తే రైతులు అందుకు అనుగుణంగా పంటల సాగు నిర్ణయాన్ని తీసుకునే అవకాశం ఉంటుంది. లేదంటే పంటలు సాగు చేస్తే తర్వాత సాగునీరు అందక తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడతాయి. కెసి కాలువకు నీటి ఆధారమైన శ్రీశైలం రిజర్వాయర్‌లో నీరు తక్కువ స్థాయిలో ఉండడంతో సాగునీరు విడుదల చేయడం దాదాపు అనుమానమే. కెసి కాలువ నీరు ప్రవహించే మండలాల్లో పసుపు, కూరగాయల పంటలు సాగులో ఉన్నాయి. ఈ రైతుల కోసం రెండు మూడు దఫాలు నీటిని విడుదల చేయాల్సి ఉంది. కాబట్టి కెనాల్ అధికారులు స్పష్టమైన ప్రకటన విడుదల చేసి నీరు ఎప్పుడు విడుదల చేసేది తెలిపితే ఆరుతడి పంటలు సాగు చేసుకుని రైతులు వేసవిలో పది రూపాయలు సంపాదించుకునే అవకాశం ఏర్పడుతుంది. కెసికాలువకు మార్చి వరకు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేస్తారా లేకుంటే విడతల వారీగ విడుదల చేస్తారా అనేది స్పష్టమైన ప్రకటన విడుదల చేస్తే అందుకు అనుగుణంగా రైతులు పంటలను సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం వరి నూర్పిడి పనులు పూర్తయ్యాయి. కొంతమంది రైతులు ఆరుతడి పంటలు సాగు చేసేందుకు దుక్కిళ్లు చేపడుతున్నారు. కొంతమంది సాగుపై సందిగ్ధంలో ఉన్నారు.


దుక్కిళ్లు చేపట్టిన వరి పొలాలు

## ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు
# సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 31 వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, రైతులు వినియోగించుకుని ప్రయోజనం పొందాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 'ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు' పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఇందులో పశువైద్య చికిత్సలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణకు మందుల పంపిణీ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు. రైతులు వినియోగించుకుని ప్రయోజనం పొందాలని అన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, పశుసంవర్ధక శాఖ జెడి శారదమ్మ, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, సిఇఒ ఓబులమ్మ, డిపిఒ స్వరాజ్యాలక్ష్మి, వయోజన విద్య డిడి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

**అభ్యసన అవగాహన అవసరం**

సమాజంలో అందరికి జీవితకాల అభ్యసన అవగాహన కలిగి ఉండాలని, ప్రయోజనం పొందాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సభాభవనంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో


'ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు' పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జెసి, అధికారులు

ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమం స్టిక్కర్ క్యాలెండర్, వాచకం, మార్గదర్శిని, అటెండెన్స్ రిజిస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న తనంలో బడి చదువుకు నోచుకోని 15 ఏళ్ళు దాటిన వారికి చదవడం, రాయడం (క్రియాత్మక అక్షరాస్యత), ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతలను నేర్పించి, వారు మెరుగైన జీవన ప్రమాణాలను సాధించేలా చేయడమే 'ఉల్లాస్' కార్యక్రమ ఉద్దేశం అన్నారు. ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం, జీవన నైపుణ్యాలు (క్రిటికల్ లైఫ్ స్కిల్స్), వృత్తి నైపుణ్యాలు, ప్రాథమిక విద్య, నిరంతర విద్య లక్ష్యాలు ఉన్నాయన్నారు.

# వైవీయూకు ఆచార్య 'కేతు' కుటుంబం వితరణ


విసికి ఒప్పంద పత్రాలు అందజేస్తున్న కేతు శశికాంత్

ప్రజాశక్తి - కడప అర్బన్

వైవీయూ తెలుగు శాఖలో ప్రతిభావంతులకు ప్రతి ఏటా కేతు విశ్వనాథరెడ్డి పేరిట స్మారక బంగారు పతకం, నగదు బహుమతి అందించేందుకు ఆయన కుమారుడు కేతు శశికాంత్ రూ.3.5 లక్షల చెక్కులను విసి ఆచార్య కె. కృష్ణారెడ్డికి అందజేశారు. ఈ మేరకు సోమవారం విసి సమక్షంలో విద్యాలయ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి, కేతు శశికాంత్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం చెక్కులను పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రఖ్యాత విద్యావేత్త, ప్రముఖ రచయిత, సాహిత్య విమర్శకుడు, అధ్యయనశీలి తెలుగు సాహిత్య, సాంస్కృతిక అధ్యయనశీలి ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి పేరిట అవార్డు నెలకొల్పడం సంతోషదాయకమన్నారు. సాంస్కృతిక వారసత్వానికి బలమైన పునాది వేసిన ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి చిరస్మరణీయుడన్నారు. మాతృ భాషను, ప్రతిభావంతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. యూనివర్శిటీలోని తెలుగు విభాగంలోని విద్యార్థుల్లో అకడమిక్ ఎక్సలెన్స్‌ను గుర్తించి రివార్డ్ చేయడం గోల్డ్ మెడల్ లక్ష్యమన్నారు. అవార్డు, నగదు బహుమతితో పాటు, భాషాభివృద్ధికి ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఆచార్య రఘునాథ రెడ్డి మాట్లాడుతూ కేతు విశ్వనాథరెడ్డి చేసిన అమూల్యమైన కృషి ,చెరగని ముద్ర వేసిందని, భావి తరాలకు పండితులకు, రచయితలకు స్ఫూర్తినిస్తుందన్నారు. ప్రొఫెసర్ కేతు విశ్వనాథ రెడ్డి కుటుంబ సభ్యులు కేతు పద్మావతమ్మ (భార్య), కేతు శశికాంత్ (కొడుకు), కేతు మాధవి (కుమార్తె), శిరీష (కుమార్తె)ను వారు అభినందించారు. ఈ సందర్భంగా కేతు శశికాంత్‌ను సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో డీన్ ఆచార్య ఎ.జి.దాము పాల్గొన్నారు.

## వేలూరు భారతికి డాక్టరేట్

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పరిశోధకులు వేలూరు భారతికి విశ్వవిద్యాలయం డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేసింది. వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు టి.రామప్రసాద్ రెడ్డి పర్యవేక్షణలో 'ఒక శతాబ్దపు రాయలసీమ కథానిక-స్త్రీ (1926 నుంచి నేటి వరకు)' అనే అంశంపై ఈమె చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు తెలిపారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన భారతి అధ్యాపకురాలిగా పనిచేస్తూ పార్టుటైమ్ పిహెచ్‌డి. పరిశోధన చేశారు. పరిశోధనలో భాగంగా ఈమె రాసిన పరిశోధన పత్రాలు పలు జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా విశ్వవిద్యాలయ విసి. ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ,వైవీయూ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య యస్. రఘునాథరెడ్డి, తెలుగుశాఖ ఆచార్యులు, పరిశోధకులు భారతిని అభినందించారు.

## నైట్ ల్యాండింగ్ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్


జెసికి సమస్యను విన్నవిస్తున్న నాయకులు

జిల్లాలోని డొమెస్టిక్ ఎయిర్‌పోర్టుకు నైట్ లాండింగ్ పనులను పూర్తి చేయాలని రాయలసీమ అంత ర్జాతీయ విమానాశ్రయ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మాస్ మస్తాన్, ఎన్ఆర్ఐ మైనార్టీ ఉపాధ్యక్షులు రహమతుల్లా, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మసాపేట శివ ఆధ్వర్యంలో జెసి అధితి సింగ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమా ప్రజలు బతుకు దేరువు కోసం గల్ఫ్ లాంటి విదేశాలకు వెళ్లాలంటే పక్క రాష్ట్రంలోకి చేరుకుని ఎయిర్ పోర్ట్ వెళ్లి ప్రయాణం చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. అది దూర ప్రయాణంగా ఉందని తెలిపారు. అలా కాకుండా రాయలసీమ ప్రజల కోసం కడప జిల్లా ఎయిర్ పోర్టులో నైట్ లాండింగ్ పూర్తి చేస్తే మన రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాలకు ప్రయాణం చేస్తారని, ప్రయాణలు దగ్గరగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ కడప జిల్లా ఉపాధ్యక్షులు లోకేష్, నాయకులు విశ్వనాధ్, రాఘవ,ఇర్ఫాన్, నిజాముద్దీన్ పాల్గొన్నారు.


జాతీయస్థాయి చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన కడప జిల్లా చెస్ క్రీడాకారులు

## చెస్ టోర్నీలో జిల్లాకు విశిష్ట గౌరవం

ప్రజాశక్తి - కడప

కడప జిల్లాకు జాతీయస్థాయి చెస్ టోర్నమెంట్‌లో విశిష్ట గౌరవం లభించింది. కర్నూలు నగరంలోని భాష్యం స్కూల్, బాలాజీ నగర్ వద్ద జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ ప్రైజ్ మనీ చెస్ టోర్నమెంట్‌లో వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన 23 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో కడప జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు అద్భుత విజయాలు సాధించారు.ఈ టోర్నమెంట్‌లో డీ. అష్రఫ్ సుభాని ఫస్ట్ ప్రైజ్‌గా రూ. 10 వేల నగదు బహుమతిని గెలుచుకున్నారు. టి. శ్రీకాంత్ 8వ స్థానం సాధించి రూ.1,500 నగదు బహుమతి పొందారు. సీనియర్స్ కేటగిరీలో అనీస్ దర్బారి మొదటి స్థానంలో నిలిచారు. రూ.1,000 నగదు బహుమతి గెలుచుకున్నారు.

## ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ కేలండర్‌ను రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయ భాస్కర్, డాక్టర్ లక్ష్మీ నరసమ్మ, సంఘం అధ్యక్షులు డాక్టర్ ఫరూక్, కార్యదర్శి డాక్టర్ సుబ్బారాయుడు, సభ్యులు డాక్టర్ యు.శ్రీనివాస్, డాక్టర్ యాదవేంద్ర రెడ్డి, డాక్టర్. బాలాజీ, డాక్టర్ స్వామిదాస్, డాక్టర్ షాహిద్, డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.


కేలండర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ

## కడప నూతన ఎస్‌పిగా అశోక్‌కుమార్


ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లా నూతన ఎస్‌పి ఇ.జి.అశోక్‌కుమార్ నియమితులయ్యారు. ప్రభుత్వం సోమవారం రాత్రి రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఐపిఎస్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సోషల్ మీడియా కేసులో దొర్లిన తప్పిదం నేపథ్యంలో పూర్వ ఎస్పీ హర్షవర్ధన్‌రాజుపై ప్రభుత్వం సీరియస్ చర్యలు తీసుకుంది. ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుకు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించింది. నూతన ఎస్పీ అశోక్‌కుమార్‌ను ఇంటిలిజెన్స్ ఎస్‌పి (ఎస్‌పిఎస్) విధుల నుంచి బదిలీ చేసింది. ఈయన కడప డిఎస్పీగా విధులు నిర్వహించిన అనుభవం ఉంది. 2024 అక్టోబర్, నవంబర్ నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల ముందు సోషల్ మీడియాలో వెల్లువెత్తిన అనుచిత పోస్టులపై భారీగా కేసులు నమోదైన సంగతి తెలిసిందే. కడప జిల్లాకు చెందిన వైసిపి సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్‌రెడ్డి రాష్ట్రంలోని రాజకీయ ప్రముఖులపై అనుచిత పోస్టులు చేశారనే ఆరోపణల నేపథ్యంలో అదుపులోకి తీసుకుని, విడుదల చేయడంలో దొర్లిన పొరబాటు ఘటన నేపథ్యంలో ప్రభుత్వం సీరియస్‌గా చర్యలు తీసుకుంది. అప్పటి ఎస్‌పి వి.హర్షవర్ధన్‌రాజు స్థానంలో అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యా సాగర్‌నాయుడుకు ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించిన సంగతి తెలిసిందే. అప్పటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కూటమి సర్కారు ఎస్పీ హర్షవర్ధన్‌రాజుపై చర్యలు తీసుకుంది. నాలుగు నెలలుగా రెగ్యులర్ ఎస్‌పి లేని పరిస్థితి నెలకొనడం గమనార్హం. ఆయన జిల్లాలో చోటుచేసుకున్న రోడ్డుప్రమాదాలు, గంజాయి వంటి ఘట నలపై సీరియస్‌గానూ, వేగంగానూ స్పందించిన తీరు పలువురు ప్రశంసలు అందుకుందని చెప్పవచ్చు.

## మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

ప్రజాశక్తి - కడప

కడప నగరం 48 డివిజన్ కృపా కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అడిషనల్ కమిషనర్ కె. రాకేష్‌చంద్ర పేర్కొన్నారు. సోమవారం ఆయన కృపా కాలనీతోపాటు బుడగజంగం కాలనీ, లోహియానగర్ ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తమ సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రోడ్డు సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నామని, డ్రెయినేజీ సన్యను పరిష్కరించాలని విన్నవించారు. స్పందించిన అడిషనల్ కమిషనర్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ, బేడ బుడగజంగం జిల్లా నాయకులు దూపం రాజు, సచివాలయ అధికారులు రోశయ్య, స్థానికులు పి.రవితేజ, రోజా, శాంతిరాజు, డి.మహేష్ పాల్గొన్నారు.


కాలనీ వాసులు సమస్యలు వింటున్న అడిషనల్ కమిషనర్

## ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్


మాట్లాడుతున్న ఎఎస్‌పి కె. ప్రకాశ్‌బాబు

సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి మరింత సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని అదనపు ఎస్‌పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు సూచించారు. ఎఆర్ సిబ్బందికి మొబిలైజేషన్‌లో భాగంగా సోమవారం స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉన్నపుడే సమర్ధవంతంగా విధులు నిర్వర్తించవచ్చని పేర్కొన్నారు. యోగా, ధ్యానం, వ్యాయామం చేయడం దినచర్యలో భాగంగా అలవరచుకోవాలన్నారు. ఎఆర్ సిబ్బంది ఆయుధాల వినియోగం, నిర్వహణపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బందోబస్తు విధుల్లో పలు మెళకువలను సిబ్బందికి వివరించారు. మొబిలైజేషన్‌లో భాగంగా నిర్వహించే తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి బి.రమణయ్య, ఆర్ఐలు ఆనంద్, శివరాముడు, శ్రీశైల రెడ్డి, వీరేష్, టైటస్, సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఉద్యోగులూ..మోసపోవద్దు'

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగులు కాని వారిని, సంఘంలో సభ్యులుగా చేరని వారిని సమీకరించి, వారే ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ సంఘ సభ్యులుగా చూపిస్తూ, సమావేశ మందిరాన్ని నింపి దాన్నే ప్రభుత్వ ఉద్యోగుల సభగా చిత్రీకరించడం కె.ఆర్. సూర్యనారాయణ, రమేష్ కుమార్‌కు అలవాటుగా మారిందని ఎపిజిఇఎ సంఘం జిల్లా కార్యదర్శి టి.విన్సెంట్ కుమార్, రామాంజనేయులు ఆరోపించారు. సోమవారం సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధ్యక్షులుగా చలామణి అవుతున్న సూర్యనారాయణను ఇదివరకే సంఘం నుంచి బహిష్కరిస్తూ బుద్ధి చెప్పినా వారి వైఖరిలో ఎటువంటి మార్పు రాలేదని చెప్పారు. గత ప్రభుత్వంలో దోచుకున్న ఉద్యోగుల సొమ్ములు జిపిఎఫ్, జిపిపిఎఫ్, ఎపిజిఎల్ వారి ప్రమేయం లేకుండా డబ్బులు ఖాజేశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలు రూ.2,800 కోట్లలో సంక్రాంతి కానుకగా రూ.1,320 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వానికి, ముఖ్య మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన మొత్తాన్ని కూడా త్వరలో ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లింపు చేస్తారని ఆశిస్తున్నామన్నారు. పెండింగ్ డిఎలను, పిఆర్‌సి కమిటీని త్వరలో పూర్తి చేస్తారన్న నమ్మకం ఉందన్నారు.

## అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - కడప

ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జెసి అదితిసింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) లో జెసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. కింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారినే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం ప్రజల నుంచి వారు అర్జీలను స్వీకరించారు. తొలుత జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ పిజిఆర్ఎస్ దరకాస్తులపై ఆయా జిల్లా అధికారులతో సమీక్షించారు. రాజుపాలెం మండలం అరగడ వేముల గ్రామానికి చెందిన సి. సరళ అరగడ వేముల జడ్‌పి హై స్కూల్‌లో ఆయా పోస్ట్‌లో రిజాయిన్ చేసుకోవాలని అభ్యర్థించారు. కడప రాజారెడ్డి వీధికి చెందిన కె. పవన్ రామ్ సిద్దవటం మండలంలో తన తండ్రి కె.బాలాజీ సుకుమార్ ఎస్‌జి టీచర్‌గా పనిచేస్తూ 2012 మే 13న మృతిచెందారని, కారుణ్య ఉద్యోగ నియామకం కోసం ప్రతిపాదనలు పంపాలని అభ్యర్థించారు. రాజుపాలెం మండలం టంగుటూరు గ్రామానికి చెందిన రాచంరెడ్డి మాధవి చౌక ధరల దుకాణం డీలర్ నియామక ప్రక్రియ కింద నోటిఫికేషన్ విడుదల అయిందని తనకు డీలర్‌గా నియామకానికి సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర్ నాయుడు, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, జిల్లా వ్యవసాయశాఖాధికారి నాగేశ్వరరావు, ఎస్‌డిసి వెంకటపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్
## ఉపాధ్యక్షులుగా కె.చిన్నపరెడ్డి

ప్రజాశక్తి - కడప



రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా కడపకు చెందిన కె. చిన్నపరెడ్డి ఎన్నికయ్యారు. విశాఖపట్నంలో ఈనెల 19న రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో హ్యాండ్ బాల్ రాష్ట్ర అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఎలమంచి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ రాజు ఉపాధ్యక్షులుగా కడపకు చెందిన కె. చిన్నపరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కె చిన్నప్పరెడ్డి ఎన్నిక కావడం పట్ల కడప జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి వి.వి. శివప్రసాద్, అసోసియేషన్ సభ్యులు, హ్యాండ్ బాల్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తూ చిన్నపరెడ్డికి అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎడిపై స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి


ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో గుర్తింపు లేని ఎడిఫై స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆలిండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జగదీష్, ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో కడప పట్టణంలోని గుర్తింపు లేకుండా ముందస్తు అక్రమ అడ్మిషన్లపై డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్రాస్ రోడ్డులో అమర స్వామి కాంప్లెక్స్ లోనీ ప్రయివేటు బిల్డింగ్‌లో అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారని తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలంలోని రాయచోటి రోడ్డు బుగ్గలేటి పల్లెలో గుర్తింపు లేని నిర్మాణంలో కడప జిల్లా ఎడిఫై ప్రయివేట్ పాఠశాల అడ్మిషన్ల పేరుతో వేల రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రులతో రాబడుతున్నారని చెప్పారు. కడప జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. విద్య హక్కుచట్ట ప్రకారం గుర్తింపు పొందిన పాఠశాలలు మాత్రమే అడ్మిషన్లు చేసుకోవాలని తెలిపారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళనలు చేస్తామని చెప్పారు.

# ఆశల పల్లకీలో తెలుగు తమ్ముళ్లు

### - పార్టీ జెండా మోసిన వారిని పట్టించుకోవడం లేదన్న విమర్శ

ప్రజాశక్తి-అట్లూరు



బద్వేల్ నియోజకవర్గంలోని టిడిపి నాయకులు కార్యకర్తలలో ఆశలు చిగురిస్తున్నాయి. దీనికి కారణం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారం రోజుల కిందట పార్టీకి చెందిన మంత్రులు, ఎంపీలు, జోనల్ స్థాయి నాయకులతో అమరావతిలో సమావేశమైనట్లు విశ్వసనీయమైన సమాచారం. ఈ సమావేశంలో స్థాయి నాయకులతోపాటు కార్యకర్తలకు ఎటువంటి నామినేటెడ్ పదవులు కేటాయించాలో సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తయిన సందర్భంగా సిఎం చంద్రబాబు నాయుడు నామినేటెడ్ పదువుల కేటాయింపులపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ప్రతి నియోజక వర్గంలోనూ కష్టపడ్డ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమపడిపార్టీని అధికారంలోకి తీసుకొచ్చారన్న భావన మదిలో ముద్ర వేసుకుంది. ఇప్పటికే రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా పరిటాల వెంకటసుబ్బయ్య, ఇదేవిధంగా క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వేణు గోపాల్‌ను నియ మించారు. ఈనేపథ్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలలో ఆశలు చిగురించాయి. బద్వేల్ నియోజకవర్గంలో టిడిపిలో వర్గ విభేదాలతో కొట్టు మిట్టాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. పార్టీ జెండా మోసిన వారిని నియోజవర్గ ఇన్‌ఛార్జి పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అలాగే తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పసుపు జెండా మోస్తున్న సైనికులు ఎంతో మంది ఉన్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాటాలు నిర్వహించిన వారూ ఉన్నారు. వీరంతా పదవులపై ఆశలు పెటుకున్నారు. అయితే ఎన్నికల ముందు వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన వారు మాత్రమే చక్రం తిప్పు తుండడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అసంతృప్తి సెగలు కక్కుతుంది. ఈ నేపథ్యంలో బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ రైల్వే క్లాస్ 1 కాంట్రాక్టర్ మంచూరు. సూర్యనారాయణ రెడ్డికి రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పోస్ట్ ఇచ్చి గుర్తించాలని బద్వేల్ నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు కోరుతున్నారు.


డివైఎఫ్ఐ నూతన కమిటీ సభ్యులు, నాయకులు

## కడప 'ఉక్కు' కోసం నిరంతర పోరాటాలు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి నిరంతర పోరాట కార్యక్రమాలు తప్పవని డివైఎఫ్ఐ మాజీ నాయకులు సత్యనారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరబాల శివకుమార్ తెలిపారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో సోమవారం పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా కడప ఉక్కు పరిశ్రమ దుస్థితి మారడం లేదన్నారు. పాలకుల హామీలు నీటిమీద రాతలు లాగానే మిగిలిపోతున్నాయే కానీ, కడప ఉక్కు పరిశ్రమకు అడుగులు ముందుకు పడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం కరువుతో అల్లాడుతున్న రాయలసీమకు సంజీవని కడప ఉక్కు అని అన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్ పాల్గొన్నారు. అనంతరం ప్రొద్దుటూరు పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మేరి కుమార్, కార్యదర్శిగా విశ్వనాథ్, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసులు, సభ్యులుగా చిన్న సుబ్బారావు, రమేష్, పక్కీరయ్య ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మెరి కుమార్, విశ్వనాథ్ మాట్లాడుతూ తమపై నమ్మకముంచి బాధ్యతలిచ్చిన జిల్లా కమిటీకి ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్యపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తామన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ వీరకిషోర్

## 'ఉపాధి' కూలీలకు పనులు చూపాలి

**ప్రజాశక్తి - చాపాడు**

ఉపాధి కూలీలకు పనులు చూపాలని ఎంపిడిఒ వీరకిషోర్ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఉపాధి ఎపిఒ జగదీశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ వ్యవసాయ పనులు ముగిసినందున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కూలీలకు పనులు వెంటనే కల్పించాలన్నారు. ప్రస్తుతానికి మండలంలో 60 మంది మాత్రమే ఉపాధి పనులు పొందుతున్నారని, ఈ వారంలో వారి సంఖ్య 300కు చేరాలన్నారు. కెసి కాలువకు నీరు ప్రవహిస్తుండడంతో పనులు చూపడం కష్టమవుతుందని సిబ్బంది సమావేశం దృష్టికి తెచ్చారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో పనులు చూపాలని ఎంపిడిఒ సూచించారు. ఇసి రాజా, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## లోకేష్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి కోరడం హాస్యాస్పదం

**- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి**

**ప్రజాశక్తి - వేంపల్లె**

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు డిప్యూటీ సిఎం పదవి ఇవ్వమని కొందరు టిడిపి నాయకులు సిఎంను అడగడం హాస్యాస్పదమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి తప్పుపట్టారు. వేంపల్లెలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిప్యూటీ సిఎం పదవి ఆరోవేలు వంటిదని, అడ్డమే తప్ప ఉపయోగం లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి, భారత మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి అన్నారని తెలిపారు. భారత రాజ్యాంగంలో ముఖ్యమంత్రి, మంత్రుల ప్రస్తావన ఉందేకానీ, ఉప ముఖ్యమంత్రి లేదన్నారు. రాజ్యాంగంలో 164 అధికరణ, క్లాజ్ (1) ప్రకారం గవర్నర్ ముఖ్యమంత్రిని నియమిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి సలహా మేరకు మంత్రులను గవర్నర్ నియమిస్తారని తులసిరెడ్డి వివరించారు. ఉప ముఖ్య మంత్రి పదవికి ప్రోటోకాల్ ఉండదన్నారు. అదనపు అధికారాలు, హక్కులు, బాధ్యతలు లేనందున ప్రమాణ స్వీకారం కూడా ఉండదని తెలిపారు. పవన్ కల్యాణ్ కూడా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారే తప్ప ఉప ముఖ్యమంత్రిగా చేయలేదన్నారు. లోకేష్ మీద ప్రేమ, ఆయన పరిపాలనా సామర్థ్యం మీద అంత నమ్మకం ఉంటే టిడిపి నాయకులు ముఖ్యమంత్రి పదవి ఇవ్వమని అడ గాలని సూచించారు. పవన్‌ను తగ్గించాలనుకుంటే ఆయనకు ఉన్న డిప్యూ టీ సిఎం పదవి ఊడ పీకాలని చెప్పారు. సిఎం పదేపదే స్వర్ణాంధ్ర, సంతోష, ఆరోగ్య, సంపద ఆంధ్ర అంటున్నారని, ముందు ఆయన సొంత జిల్లాలో, సొంత నియోజకవర్గం కుప్పంలో ఏనుగుల బెడద నుండి ప్రజలను రక్షించాలని కోరారు.

## రేపు ముద్దనూరు మండల సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి - ముద్దనూరు**

స్థానిక మండల ప్రజా పరిష్యత్ కార్యాలయ సభా భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ అలవలపాటి ముకుందారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో విద్య, వైద్యం, ఉపాధి, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వ్యవసాయం, ఇళ్లు, రోడ్లు వంటి అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. సమావేశానికి ఆయా శాఖల మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపిడిఒ కోరారు.

## కెవిఆర్, శ్రీమేథా ఆస్పత్రిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్ )**

కెవిఆర్, శ్రీమేథా ప్రయివేట్ హాస్పిటల్స్ వైద్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు, విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కడపలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ బ్రహ్మయ్య వర్గం జిల్లా అధికార ప్రతినిధి గడ్డం నరసింహులు మాదిగ, విద్యార్థి యువజన నాయకులు జగన్, ఓబులేష్ కత్తి, బెనర్జీ మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణంలో కొంతమంది ప్రయివేట్ వైద్యులు వైద్యం అందించడానికి రూ.లక్షలు ప్రజల నుండి దోచుకుంటున్నారని ఆరోపించారు. టోకెన్ ఫీజు దాదాపు రూ.200 నుంచి రూ.500 తీసుకుంటున్నారని తెలిపారు. మందులు, ల్యాబ్ పేరిట రూ.వేల నుంచి రూ.లక్షల వరకు ఖర్చు పెట్టిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు లింగమయ్య, రాము, బయన్న, రాజు, శ్రావణ్, నరసింహ, గోన ఏసుదాసు, చెన్నయ్య, ప్రజలు పాల్గొన్నారు.

## రత్నకుమారికి సావిత్రి బాయి ప్రతిభ అవార్డు

**ప్రజాశక్తి - వేంపల్లె**



అవార్డు అందుకుంటున్న డాక్టర్ రత్నకుమారి

ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ఐటిలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ రత్నకుమారికి సావిత్రి బాయి పూలే జాతీయ ప్రతిభ అవార్డు వరించిందని డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిర్‌లోని అసెంబ్లీ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌పిఎల్‌టిఒ సంస్థ సావిత్రిబాయి పూలే అవార్డును అందించారు. ఆమె ప్రతిభ, కంట్రిబ్యూషన్‌ను గుర్తించి ఈ అవార్డును ఎంపిక చేశారన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ పి.నాగయ్య ఆధ్వర్యంలో అవార్డును గుంటూరు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, వ్యవస్థాపకుడు నాగయ్య అందజేశారన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేసి ఆమెను అభినందించారు.

# వణికిస్తున్న చలిపులి

## ఉదయం పూట కప్పేస్తున్న పొగమంచు - జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు


రోడ్డును కప్పేసిన పొగ మంచు

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

ప్రస్తుతం రానురానూ ఉష్ణోగ్రతలు కనిష్టస్థాయికి పడిపోతున్నాయి. చలి ప్రజల్ని భయపెడుతోంది. ఉదయం 9గంటలవుతున్నా బయటకు రావాలంటే హడలిపోతున్నారు. కమ్ముకున్న పొగమంచు వీడడం లేదు. పొలానికి వెళ్లే రైతులు, ఆరుబయట ప్రదేశాల్లో నిద్రించే అభాగ్యులు, నిరాశ్రయుల బాధ వర్ణనాతీతంగా ఉంది. తెల్లవారుజాము నుంచి వ్యాపారాలు చేసేవారు బెంబేలెత్తుతున్నారు. కూరగాయలు, పాలు అమ్మేవారి పరిస్థితి భయంగా ఉంది. మరోవైపు సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో బాధితులు ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

**నిత్యం అప్రమత్తత అవసరం..**

రోజువారి తీసుకునే ఆహారం, మంచినీరు నుంచి ధరించే దుస్తుల వరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. చలి ఎక్కువగా ఉన్నప్పుడు ఆరుబయట తిరిగితే న్యూమోనియా వ్యాధితోపాటు శ్వాస సంబంధిత వ్యాధులు, అలర్జీ, ఆస్తమా విజృంభిచే అవకాశం ఉంటుంది. ఇన్ఫోసియాలో గుండెకు సం బంధించిన రోగులు, పిల్లలు, బాలింతలు, వృద్ధులు, గర్భిణులు శరీరాన్ని ఎల్లప్పుడూ వేడిగా ఉంచేందుకు ప్రయత్నించాలని వైద్యులు సూచిస్తున్నారు. చలిగాలులు తీవ్రంగా ఉన్నప్పుడు సూక్ష్మజీవులు గాలిలో అధికంగా ఉంటాయి. అవి గాలి ద్వారా శరీరంలోకి ప్రవేశించి అంటువ్యాధులు తెచ్చే ప్రమాదం ఉంది. చలిగాలిలో వ్యాపారాలు చేసేవారు.. ప్రయాణం చేసేవారు.. వాకింగ్ చేసేవారు ముక్కు, చెవి, నోటికి మాస్కులు విధిగా ధరించాలి. తలపాగా, మాస్కులు ధరించాలి. మధుమేహం, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులతో భాధపడేవారు ఎట్టి పరిస్థితుల్లో చల్లటి గాలుల్లో బయటకు వెళ్లరాదు. శరీరాన్ని పూర్తిగా కప్పేలా దుస్తులు ధరించడంతోపాటు తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవడం మంచిది. జలుబు, దగ్గు వంటి వ్యాధులు తగ్గకుంటే వెంటనే వైద్యులను సంప్రదించడం ఉత్తమం. గోరువెచ్చని నీటిని అధికంగా తాగితే కాస్త ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వయో వృద్ధులను బయట తిరగకుండా జాగ్రత్త వహిస్తే మంచిది.

**పొలాలకు వెళ్లాలంటే కష్టంగా ఉంది**

పొలాలకు వెళ్లాలంటే చాలా కష్టంగా ఉంది. ఉదయం ఎనిమిది గంటల వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. పొలాల దగ్గరికి వెళ్లలేక అవస్థల పడాల్సి వస్తుంది. చలితోపాటు పొగమంచు వల్ల పొలాల్లో తేమ ఎక్కువగా ఉంటోంది. **- మదన్‌మోహన్ రెడ్డి, రైతు, లింగాల మండలం**

**ఇంత చలి ఎప్పుడూ చూడలేదు..**

మధ్య ఉత్తర భారత దేశానికి వీస్తున్న గాలుల కారణంగా చలితీవ్రత పెరిగి, ఉష్ణోగ్రతలు ఘననీయంగా పడిపోయాయి. వాతావరణంలో ఆకస్మిక మార్పుల వల్ల చిన్న పిల్లలు, వృద్ధులు అనేక బాధలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రాత్రి, ఉదయం వేళల్లో బయటకు రాలేని పరిస్థితి. జలుబు, జ్వరం, ఊపిరి ఆడకపోవడం వంటి సమస్యలతో బాధ పడాల్సి వస్తోంది. ఇలాంటి రుగ్మతల బారిన పడే కన్నా ఇంటి పట్టున ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మంచిదని భావిస్తున్నాం.

**- సూర్యనారాయణ, రిటైర్డు టీచర్, పులివెందుల**

**అప్రమత్తత ఆవశ్యకం..**

చలి తీవ్రత వల్ల బిపి, షుగర్ లెవెల్లో హెచ్చుతుగ్గలుండే అవకాశం ఉంది. తెల్లవారుజామున వీరు వాకింగ్, జాగింగ్ వెళ్లకుండా ఉంటే మరీ మంచిది. ఇప్పుడు వీస్తున్న విపరీతమైన చలి గాలులకు రక్తం గడ్డ కట్టడం ద్వారా గుండెపోటు, పక్షవాతం, బ్రెయిన్ స్ట్రోక్ వంటివి వచ్చే ప్రమాదం ఉంది. వైద్యుల సలహా మేరకే రోగులు, చిన్నపిల్లలు, వయోవృద్ధులు బయట తిరగాలి. **- డాక్టర్ సుకన్య, సర్వజన వైద్యశాల, పులివెందుల**

# ప్రతి గ్రామ పంచాయతీలో పశు ఆరోగ్య శిబిరాలు


జీవాలకు వైద్యం అందిస్తున్న డాక్టర్ వాసా శ్రీనివాస

**ప్రజాశక్తి - ముద్దనూరు**


ప్రతి గ్రామ పంచాయతీలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస తెలిపారు. తిమ్మాపురం గ్రామంలో సోమవారం వాసా శ్రీనివాస ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు ఆరోగ్య శిబిరాలు ఈనెల 31 వరకు ప్రతి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించామన్నారు. ఎదకురాని, ఆరోగ్యం సరిగా లేని పశువులకు, గర్భకోశ వ్యాధులకు వైద్యం చేశామన్నారు. బాహ్య, పరాన్న జీవుల నిర్మూలనకు వైద్యం అందించామన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**ఖాజీపేట :** పశువుల ఆరోగ్య రక్షణకు నట్టల నివారణ మందు తాపించాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు మురళి పేర్కొన్నారు. సోమవారం కొత్తపేట, సన్నపల్లె గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ కొట్టాలు పశు వైద్యాధికారి డాక్టర్ రామచంద్ర, ఏటూరు పశువైద్యాధికారి డాక్టర్ లక్ష్మయ్య జీవాలకు, పశువులకు వైద్యం చేశారు. పశుసంవర్ధక శాఖ ద్వారా అమలవుతున్న పథకాల గురించి పశు పోషకులకు వివరించారు. గర్భకోశ, సాధారణ వ్యాధులకు చికిత్సలు చేశారు.

**చాపాడు(మైదుకూరు) :** పప్పనపల్లె గ్రామ పంచాయతీ ఓబులాపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆ గ్రామ సర్పంచు ములే వెంకటలక్షుమ్మ ప్రారంబించారు. ఎనిమిది పశువులకు చూడి పరీక్షలు, 11 పశువులకు గొడ్డు మోతు సమస్యలు, దూడలకు నట్టల నివారణ మందులు, సాధారణ చికిత్సలు 46, 3,548 జీవాలకు నట్టల నివారణ మందులు తాపించారు. కార్యక్రమంలో వనిపెంట పశువెద్యాధికారి ఆర్.సుధాకర్, ఎహెచ్ఎ మీరావలి, వి.మీరా కుమారి, ఎం.లావణ్య, సిబ్బంది టి.చిన్న సుబ్బారాయుడు, గోపాలమిత్ర నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

- బద్రిపల్లి గ్రామంలో డాక్టర్ ఎస్ మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జమ్మలమడుగు సంయుక్త సంచాలకులు వీరబ్రహ్మం రైతులకు సూచనలు చేశారు. అనంతరం జీవాలు, పశువులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, దస్తగిరి పాల్గొన్నారు.

**సింహాద్రిపురం :** మండలంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు, గొర్రెల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని పశువర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివప్రసాద్ కోరారు. సింహాద్రిపురం, నిడువెలగల గ్రామాల్లో పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి యూనస్, రైతులు పాల్గొన్నారు.


వినతిపత్రమిస్తున్న మార్కెట్ సంఘ నాయకులు

## కూరగాయల మార్కెట్ సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

ప్రొద్దుటూరు మున్సిపల్ మైదానంలో తాత్కాలిక మార్కెట్‌ను ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు చాలా ఉపయుక్తంగా ఉంది. అయినా కూరగాయ మార్కెట్‌లో సమస్యలు పేరుకుపోతున్నాయని, వాటిని మున్సిపల్ కమిషనర్ స్పందించి పరిష్కరించాలని ప్రొద్దుటూరు మార్కెట్ మర్చంట్ వ్యాపారస్తుల అసోషియేషన్ అధ్యక్షులు వల్లీబాషా, ప్రధాన కార్యదర్శి ఖాసి, కోశాధికారి మహేంద్రనాద్ కోరారు. ఆ మేరకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్‌లో లోడింగ్, అన్‌లోడింగ్ వాహనాల వల్ల వినియోగదారులు, వ్యాపారస్తులకు అసౌకర్యంగా ఉందన్నారు. అక్కడున్న పలు సమస్యలను వారు కమిషనర్‌కు వివరించారు. ఇందుకు స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ ఓనర్, గుమాస్తాల పార్కింగ్, అన్‌లోడింగ్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. వాహనాల పార్కింగ్ బయటే ఉండాలన్నారు. మరుగుదొడ్ల సమస్యలను పరిష్కరించడంతోపాటు మార్కెట్ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## నేత్రదానం వారసత్వంగా రావాలి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**


సన్నెబోయిన రమణయ్య (ఫైల్)

నేత్రదానం కుటుంబ వారసత్వంగా రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నేత్ర, నరక్త, అవయవ దాన ప్రోత్సాహకులు పల్లవోలు రమణ పిలుపునిచ్చారు. చాపాడు మండలం పల్లవోలు గ్రామానికి చెందిన సన్నెబోయిన రమణయ్య (63) అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న రమణ మృతుడు రమణయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి నేత్రదాన ఆవశ్యకతను వివరించారు. మృతుడి కుమార్తె రమణమ్మ, భార్య సాయమ్మను ఒప్పించారు. హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ ఆసుపత్రికి చెందిన రాజేంద్ర ప్రసాద్ కార్నియాలను సేకరించారు. వీటిని హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు అందిస్తారని రమణ పేర్కొన్నారు. భారతదేశంలో సుమారు 13 లక్షల మంది కార్నియా అంధులున్నారని ప్రతి ఒక్కరూ నేత్రదానానికి సహకరించాలని రమణ కోరారు.

## సరైన ధ్రువపత్రాల్లేకపోతే జరిమానా

**ప్రజాశక్తి - వేముల**

స్థానిక కడప-పులివెందుల ప్రధాన రహదారి గొందిపల్లె క్రాస్ వద్ద సోమవారం ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు. ముందుగా వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. సరైన ధ్రువపత్రాల్లేని వాహన యజమానులకు చలానా విధించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

## అడ్డుగా వాహనాలు పెడితే కఠినచర్యలు

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

సింహాద్రిపురం బస్టాండ్ సమీపంలో రోడ్డుకు అడ్డుగా వాహనాలు పెడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ తులసి నాగప్రసాద్ హెచ్చరించారు. ఆ మేరకు సోమవారం బస్టాండ్ సమీపంలో అడ్డదిడ్డంగా వాహనాలు పెట్టిన వారికి జరిమానా విధించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా మోటర్ బైకులు, ఇతర వాహనాలు పెట్టడం వల్ల ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. రోడ్డు పక్కన కాకుండా వేరేచోట పార్కింగ్ చేసుకోవాలని ఆయన సూచించారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**ప్రజాశక్తి - వేంపల్లె**

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్ఐ తిరుపాల్ నాయక్ సూచించారు. సోమవారం ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించిన పలుచోట్ల కొందరికి జరిమానా విధించారు. నాలుగు రోడ్ల కూడలి, హనుమాన్ జంక్షన్, ఎన్‌టిఆర్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రికెట్ విజేతకు బహుమతి ప్రదానం

**ప్రజాశక్తి - ముద్దనూరు**


నగదు బహుమతులు అందజేస్తున్న మధుసూదనరెడ్డి

సంక్రాంతి పండుగ సందర్భంగా పులివెందుల రహదారి బిఎస్ఎన్ఎల్ మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్లో విన్నర్, రన్నర్ జట్లకు డాక్టర్ కటికరెడ్డి మధుసూదనరెడ్డి బహు మతులు అందజేశారు. క్రికెట్ పోటీల్లో మొత్తం 30 జట్లు పాల్గొన్నాయి. సోమవారం ఫైనల్లో ప్రొద్దుటూరు టీమ్ ముద్దనూరు జట్టు ఆడగా ప్రొద్దు టూరు విజయం సాధించింది. విన్నర్‌గా ప్రొద్దుటూరు జట్టు రూ.25వేలు అందుకుంది. రన్నర్‌గా ముద్దనూరు జట్టు రూ.15వేలు అందుకున్నారు.

## ప్రతిభచాటిన విద్యార్థులకు ఉపకారవేతనాలు

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

2023-2024 పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి పులివెందుల పట్టణంలో ఒకటి, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన శ్రీ స్వామి వివేకానంద విద్యాసంస్థల విద్యార్థులకు ఆ పాఠశాల యాజమాన్యం మెరిట్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కాలర్‌షిప్ ప్రకటించింది. ఆ మేరకు సోమవారం సాయంత్రం విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు. 595 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచిన ఒ.ఝాన్సీలక్ష్మి రూ.2,00,000, 594 మార్కులతో రెండవ స్థానంలో నిలిచిన ఎస్.జాషువా రూ.50,000, 593 మార్కులతో మూడవ స్థానంలో నిలిచిన వై.గంగా బాలాజిరెడ్డి, అర్చన రూ.50000, తర్వాత స్థానాల్లో నిలిచిన జె.మహాలక్ష్మి, ఆర్.నిషిత రూ.50,000 కరస్పాండెంట్ ఎన్.సోమశేఖర్ రెడ్డి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఎన్ సాయిశరణ్‌రెడ్డి విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ వసీం, ప్రిన్సిపల్స్ రమణారెడ్డి, గీత, గంగరాజు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.


విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్న యాజమాన్యం


చెక్కు పంపిణీ చేస్తున్న మారెడ్డి జోగిరెడ్డి

## పేదలకు వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**- తుంగభద్ర ప్రాజెక్ట్ హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి**

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

పేదలకు వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తుంగభద్ర ప్రాజెక్ట్ హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని లబ్ధిదారులకు ఆయన సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.22,17,000 చెక్కులను అందజేశారు. అనంతరం జోగిరెడ్డి మాట్లాడుతూ సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఆర్థికంగా ఎంతోగానో దోహదపడుతుందన్నారు. కార్పొరేట్ స్థాయిలో నిరుపేదలకు వైద్యం అందుతుందని తెలిపారు. సిఎం రిలీఫ్ ఫండ్, ఎల్‌ఒసి విషయంలో పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి(బిటెక్ రవి) ప్రత్యేకశ్రద్ధ కనబరుస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు, బీటెక్ రవికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో లింగాల టిడిపి సీనియర్ నాయకుడు దేవిరెడ్డి సంజీవరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కుష్టు వ్యాధి నిర్మూలనపై నిర్వహిస్తున్న ర్యాలీలో వైద్య సిబ్బంది

## కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

**ప్రజాశక్తి - ఖాజీపేట**

ప్రతి ఒక్కరూ కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి, దాని నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అడిషనల్ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సగిలి రవిబాబు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ముస్లిం కాలనీలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఆయేషా సుల్తాన్ ఆధ్వర్యంలో ఇంటింటా తనిఖీ కార్యక్రమం చేపట్టారు. అప్పనపల్లి సచివాలయం, పుల్లూరు, రావులపల్లి, కొత్తపేట, చెముళ్లపల్లె, చెన్నముక్కపల్లె, నాగసానిపల్లె గ్రామాల్ల కుష్టు అనుమానిత కేసుల నిర్ధారణ కార్యక్రమం చేపట్టారు. కుష్టు వ్యాధిపై అపోహలు, మూఢనమ్మకాలు గురించి వివరించారు. డాక్టర్ అయేషా సుల్తాన్ మాట్లాడుతూ.. ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధిపై సర్వే చేయాలన్నారు. కుష్టురహిత మండలంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం, హెల్త్ సూపర్వైజర్ల కృష్ణప్రియ, శోభన్ బాబు, అరుణ కుమారి, ఆశ నోడల్ ఆఫీసర్, ఆశ కార్యకర్తలు చంద్రకళ, రాజేశ్వరి పాల్గొన్నారు.

**తొండూరు :** పిహెచ్‌సి డాక్టర్ ఆరిపుల్లా ఆధ్వర్యంలో కుష్టువ్యాధి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ ఈ నెల 20నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుష్టు అనుమానితులను గుర్తించాలన్నారు. అలాంటి వారు ఉంటే పిహెచ్‌సికి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రేష్మా, కమ్యూనిటీ ఆరోగ్య అధికారిని విజయ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## పింఛనుదారులకు ఇంటి వద్దనే వైద్య పరీక్షలు

**- మున్సిపల్ కమిషనర్ రాముడు**

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పథకంలో హెల్త్, విభిన్నప్రతిభావంతుల పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులకు ఇంటి వద్దనే వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు ఒక ప్రకటనల తెలిపారు. లబ్ధిదారుల పునఃపరిశీలనలో భాగంగా నియమించిన ప్రత్యేక వైద్య బృందం పులివెందుల పురపాలక సంఘం పరిధిలో ఈనెల 21న పెద్దరంగాపురం, సియోనుపురం, చెన్నారెడ్డి కాలనీ, బయమ్మతోట, మిస్సమ్మ బంగ్లా సచివాలయాలు, 22న గుంతబజార్, వెంకటాపురం, బాకరాపురం, కే.వెలమవారిపల్లి, ప్రశాంతి నగర్, అంకాళమ్మపేట, నగరిగుట్ట, శ్రీరామ టెంపుల్, రాజీవ్ కాలనీ, ఎస్‌బిఐ కాలనీ, చిన్న రంగాపురం పరిధిలోని లబ్ధిదా రులను పరీక్షించనున్నారు. ఆయా రోజుల్లో పెన్షన్ దారులు ఇంటి వద్దనే అందుబాటులో ఉండాలని ఆయన కోరారు. ఎవరు కూడా సచివాలయం, ఏ ఇతర కార్యాలయాల వద్దకుగాని వెళ్లనవసరంలేదన్నారు.

## గ్రంథాలయ పనివేళల మార్పు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

ఈ నెల 20 నుండి ప్రొద్దుటూరు శాఖా గ్రంథాలయంలో పుస్తక విభాగం, పత్రిక విభాగం పనివేళలు మార్చామని గ్రంథాలయ అధికారి తిరుపతమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.00 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు పని చేస్తుందన్నారు. పత్రిక విభాగం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విధులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పుస్తక విభాగం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు తెరచి ఉంటామన్నారు. ఈ మార్పును పాఠకులు గమనించాలని ఆమె కోరారు.

## బ్యాంకుల్లో భద్రత చర్యలు తీసుకోవాలి

**వేంపల్లె :** వేంపల్లెలో ఉన్న అన్ని బ్యాంకుల్లో తప్పనిసరిగా భద్రత చర్యలు తీసుకోవాలని సిఐ సురేష్‌రెడ్డి సూచించారు. పులివెందుల డిఎస్‌పి మురళీనాయక్ ఆదేశాల మేరకు సోమవారం సిఐ, ఎస్ఐలు రంగారావు, తిరుపాల్ నాయక్ స్థానిక పలు బ్యాంకులను తమ సిబ్బందితో పరిశీలించారు. బ్యాంకులో ఏవిధమైన భద్రత చర్యలు తీసుకుంటున్నారని సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్యాంకు సిబ్బందితో సమావేశమై బ్యాంకుల్లో ఎలాంటి దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రత చర్యలు పాటించాలని సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధుడి అదృశ్యం

**పులివెందుల రూరల్ :** లింగాల మండలానికి చెందిన పక్కీరప్ప పులివెందుల పార్లపల్లి రోడ్డు సమీపంలో ఉన్న దర్గా వీధిలో ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయారని ఆయన భార్య, బంధువులు తెలిపారు. ఇప్పటివరకు వారి బంధువులు పలు ప్రాంతాల్లో గాలించినా ఎక్కడ కనిపించకపోవడంతో సోమవారం ఆయన మనవడు గంగాధర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మనిషి తెల్లగా ఉంటారని, తెల్లచొక్కా, తెల్లపంచె ధరించి ఉంటాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు 86398 80893కు ఫోన్ చేయాలన్నారు.

## కడుపు నొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య

**సింహాద్రిపురం :** అగ్రహారం ఎస్‌సి కాలనీలో కడుపు నొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఎస్‌సి కాలనీ లోని ప్రభావతి(55) ఈనెల 17న కడుపు నొప్పి తాళలేక విషద్రావణం సేవించిందన్నారు. చికిత్స నిమి త్తం కడప రిమ్స్‌కు తరలించారు. వైద్యం పొందుతూ సోమవారం మృతి చెందిందన్నారు. భర్త సత్యం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.